ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తిరుపతి

జిల్లా వార్తలు | 5

సోమవారం 20 జనవరి 2025



తడ మండలం భీమలవారిపాలెం వద్ద..

సూళ్లూరుపేటలో స్టాళ్ల వద్ద జనసందడి

- పోటెత్తిన జనం
- పడవ షికారుకు ఉత్సాహం
- అర కొరగా బస్సులు
- నేలపట్టులో ట్రాఫిక్ జామ్
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- భారీ వర్షంతో ఇక్కట్లు



పక్షుల పండుగ అదరహో!



'పులికాట్ సరస్సుకు పర్యావరణం అతి ముఖ్యమైన అంశం. పక్షులు పెద్ద ఎత్తున వస్తాయి. అదే సమయంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నో దేశాల నుంచి వచ్చే పక్షులను కాపాడుకుంటేనే ఇలాంటి పండుగలు జరుపుకోగలం'

- కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట/ తడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ రెండవరోజు ఆదివారం అదరహో అనిపించింది.. సూళ్లూరుపేట కళాశాల మైదానప్రాంతాలు, నేలపట్టు పక్షుల రక్షితకేంద్రం, భీములవారిపాళెం పడవలరేవు,అటకానితిప్ప ప్రాంతాలకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ఇక సూళ్లూరుపేట కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను చూసేందుకు కూడా జనం పోటీపడ్డారు.ఉద్యానవనశాఖ, షార్ కేంద్రం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో జనసందడి కన్పించింది. బీవీపాళెం పడవలరేవు, అటకానితిప్పల్లో ఏర్పాటు చేసిన వేదికల వద్ద నృత్య ప్రదర్శనలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. బంగారు చీరలో ఉన్న సూళ్లూరుపేట చెంగాళమ్మను దర్శించుకునేందుకు బారులుతీరారు.

వానతో అవస్థలు

శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వాన కురిసింది. దీంతో కళాశాల మైదానంలో నీళ్ల నిలబడిపోయాయి. ఆ ప్రాంతం బురదగా మారడంతో నీళ్లను మోటార్లు పెట్టి బయటకు తోడేందుకు శ్రమించాల్సివచ్చింది. భీములవారిపాళెం పడవలరేవు వద్ద కూడా వానకు చిత్తడిగా మారిపోవడంతో అక్కడ సైతం జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జోరుగా హుషారుగా పడవ షికారు

భీములవారిపాళెం వద్ద ఏర్పాటు చేసినపడవ షికారుకు జనం ఎగబడ్డారు. వానజల్లు ఉన్నా ఉదయం నుంచే జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. భద్రత రీత్యా ఒక్కో పడవలో 10 మందికి మించి జనాన్ని ఎక్కించకపోవడంతో పడవ షికారుకు గంటపాటు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.

అర కొర బస్సులు

సూళ్లూరుపేట నుంచి నేలపట్టు, అటకానితిప్ప, భీములవారిపాళెం ప్రాంతాలకు బస్సులను నడపాలని కలెక్టర్ సూచించినప్పటికీ కేవలం పది బస్సులతో సరిపెట్టేశారు.ఆదివారం సెలవు దినం కావడంతో వేల సంఖ్యలో విచ్చేసిన సందర్శకులు ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. అదీ తిరుపతి రవాణా అధికారి మురళీమోహన్ చొరవ తీసుకుని మధ్యాహ్నం 12.30గంటలకు ఈ బస్సులను జనాలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ లోపు ఆటోల్లోనే సందర్శకులు తిరగాల్సి వచ్చింది. అటకానితిప్ప, నేలపట్టులకు వెళ్లి వచ్చేందుకు ఒక్కొక్కరికి 100 రూపాయల చొప్పున ఆటోల్లో వసూలు చేశారు. బీవీపాళెంకు అయితే ఒక్కొక్కరికి 150 రూపాయలు వసూలు చేశారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న యాంకర్ అనసూయ

వచ్చే ఏడాది మరింత ఘనంగా పండుగ

- ప్రజాప్రతినిధులతో కలిసి కమిటీలు
- జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్



దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది కూడా ఇదే నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. పక్షుల పండుగ నిర్వహణపై అనుభవం ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మరింత ఘనంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆదివారం నేలపట్టు పక్షుల కేంద్రంలో పర్యటించిన ఆయన తహసీల్దారు శైలాకుమారి, ఎఫ్ఆర్వో సౌజన్యలతో ఏర్పాట్లుపై చర్చించారు. తిరుమల ఘటనతో ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లల్లో కొంత జాప్యం జరిగిందని, ఈ ఏడాది లోటుపాట్లను గుర్తించి, వచ్చే ఏడాదికి ముందుగానే సిద్ధం అవుతామని మీడియాకు వివరించారు. మూడు నెలలకు ముందే ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

నేలపట్టులో స్తంభించిన ట్రాఫిక్ రెండు గంటలు అవస్థలు

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల కేంద్రంలో ట్రాఫిక్ అంతరాయంతో సందర్శకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద సంఖ్యలో కార్లలో వచ్చారు. దొరవారిసత్రం నుంచి పక్షుల కేంద్రం ప్రధాన గేటు వరకు మధ్యాహ్న సమయంలో రెండు గంటల పాటు వాహనాలు ఆగిపోయాయి. హైవే వంతెన, రైల్వే వంతెనల వద్ద వాహనాలు ఇరుక్కుపోయాయి. దాంతో నేలపట్టు ఆర్అండ్‌బీ రోడ్డుపై కూడా వాహనాలు బారులు తీరి కదలకుండా నిలబడిపోయాయి. పోలీసులు జోక్యం చేసికుని పరిస్థితిని చక్కదిద్దారు. సందర్శకులు పక్షులను చూశాక వాహనాలను మైలాంగం, నెల్లూరుపల్లి మార్గంలోకి మళ్ళించడంతో ట్రాఫిక్ తగ్గింది. ఇక్కడ పార్కింగ్ స్థలాలు కూడ సరిపోక ఇబ్బంది పడ్డారు.

గజ గజ

- పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగులు
- తాజాగా గజరాజుల దాడిలో మరణించిన ఉప సర్పంచ్
- ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకున్న రైతులు
- శాశ్వత రక్షణకు చర్యలేవీ?



ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలు (ఫైల్ ఫొటో)

నాలుగు రోజులుగా అలజడి

గడచిన నాలుగు రోజులుగా ఏనుగులు దేవరకొండ దాటి శేషాచల అడవుల్లోని అంకాలమ్మ గుడి, కల్యాణి డ్యామ్‌లకు చేరుకున్నాయి. డ్యామ్ మీదుగా రాత్రి పూట నారావారిపల్లె, శేషాపురం, భీమవరం అటవీ ప్రాంత సమీపంలోని పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అటవీ అధికారులు వీటిని అడవిలోకి మళ్లించేందుకు విఫలయత్నం చేస్తున్నారు. గతంలో వేసవిలో తాగునీటి కోసం డ్యామ్‌కు వచ్చి, పంటలను ధ్వంసం చేసేవి. ఇప్పుడు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఏనుగులు గతంలో సంచరించిన ప్రాంతాన్ని గుర్తించలేక దారి తప్పి తిరుగుతున్నట్లు తెలిసింది. దీంతో ఈప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. మున్నెన్నడూ లేనివిధంగా చంద్రగిరి మండలంలో ఏనుగులు దాడిచేసి ఉపసర్పంచ్ రాకేష్‌ను పొట్టనబెట్టుకోవడంతో స్థానికులు హడలిపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత మండలం కావడంతో ప్రభుత్వం వెంటనే స్పందించి గజరాజులను కట్టడి చేసి ఊరట కలిగించాలని కోరుతున్నారు.

చంద్రగిరి, జనవరి 19(జనవరి): చంద్రగిరి నియోజకవర్గంలో ఏనుగులు చెలరేగిపోతున్నాయి. తాజాగా శనివారం రాత్రి శేషాపురంలో వీటి బారిన పడి కందులవారిపల్లె ఉప సర్పంచి రాకేష్ చౌదరి(33) దుర్మరణం చెందారు. సాధారణంగా ఏనుగులు మామిడికాయల సీజన్‌లో (ఏప్రిల్, మే నెలల్లో) ఇక్కడి అటవీ సరిహద్దు ప్రాంతాల్లో సంచరించేవి. పంటలను ధ్వంసం చేసేవి. గత ఏడాది నవంబరు నెలాఖరులో చిత్తూరు జిల్లా పలమనేరు, కుప్పం ప్రాంతాల నుంచి 17 ఏనుగులు దామలచెరువు, పులిచెర్ల మండలాల మీదుగా చిన్నగొట్టిగల్లు మండలంలోకి చొరబడ్డాయి. నెల్లుట్లవారిపల్లె, భాకరాపేట పంచాయతీలోని ఎగువూరు, దిగువూరు గ్రామాల్లో పంటలను ధ్వంసం చేశాయి. సుమారు 70 ఎకరాల మామిడి, టమోటా, చెరకు పంటలను, కొబ్బరి చెట్లను నాశనం చేశాయి. దామలచెరువు పంచాయతీలోని మొరవపల్లె పదిపుట్లబైలు, ఈపాలగుట్టపల్లి, వల్లివేడు పరిసరాల్లో వరి, ఉద్యాన పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు కొద్ది రోజులుగా రాత్రి వేళ పొలాల వైపు వెళ్ళేందుకు భయపడుతున్నారు.

ఏనుగుల కట్టడికి రెండు మార్గాలు

ఏనుగుల సమస్యకు ట్రాంక్విలేజర్ (మత్తు ఇవ్వడం).. కుంకీ ఏనుగులను రప్పించడం పరిష్కార మార్గాలని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏనుగులు పంటలను ధ్వంసం చేసినా, సమీపంలో సంచరిస్తున్నా గుర్తించి అటవీ సిబ్బంది వాటికి మత్తు ఇంజెక్షను వేయాల్సి ఉంటుంది. మత్తులో ఉండగా వాటిని దూర ప్రాంతాలకు తరలించాలి. లేదా శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల ద్వారా వాటిని మళ్లీ గమ్యస్థానానికి (పాత స్థావరాలు) చేర్చవచ్చంటున్నారు.

సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు ఎప్పుడు.?

శేషాచల అడవుల్లో నుంచి పొలాల్లోకి ఏనుగులు రాకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా చర్యలు తీసుకోవడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి మంత్రి గల్లా అరుణకుమారి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. అదేసమయంలో రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో ఫెన్సింగ్ ప్రతిపాదన మరుగున పడింది. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం ఆ ప్రస్తావనే తేలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే నాని ఇటీవల అసెంబ్లీ సమావేశాలల్లో ఈ సమస్యను లేవనెత్తారు. ఇప్పటికైనా ఫెన్సింగ్ ఏర్పాటుకు కదలిక వస్తుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

14 ఏళ్ళలో 37 మంది మృత్యువాత

ఎర్రావారిపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గడచిన 14 ఏళ్ళలో 37 మంది ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో నలుగు మహిళలు ఉన్నారు. 2005లో ఎర్రావారిపాలెం మండలం మేదరపల్లెకు చెందిన రామిరెడ్డి, 2006లో తలకోనలో ఆరేటయ్య, కుప్పం మండలం ఊర్లఓబనపల్లెకు చెందిన గంగులప్పలను తొక్కి చంపేశాయి. 2009లో కుప్పం మండలం అలుగుమానుపల్లెకు చెందిన వెంకటేశ్వర్లు, 2012లో అత్తినత్తంకు చెందిన వెంకటప్ప, 2016లో రామ సముద్రం మండలానికి చెందిన వెంకట్రామయ్య, 2013లో ఎర్రావారిపాలెం మండలం కోటకాడపల్లెకు చెందిన గంగులయ్య, 2017లో వడినపల్లె వద్ద చిన్నబ్బ, 2018లో ఎర్రావారిపాలెం మండలం కోటకాడపల్లెకు చెందిన వెంకటరమణ, 2019లో పలమనేరు వద్ద ముగ్గురు ఏనుగు దాడుల్లో ప్రాణాలు విడిచారు. 2020లో పలమనేరు వద్ద మహిళా రైతు, కుప్పం-కర్నాటక సరిహద్దులో శివ, కుప్పం మండలం పత్తిచేనుకు చెందిన సోని, 2021లో కుప్పానికి చెందిన ఓ రైతు, పుత్తూరు వద్ద తూపాకుల చిన్నబ్బ, పెద్ద పంజాణికి చెందిన బంగారప్పలపై దాడి చేసి చంపేశాయి. 2022లో మొగిలి ఘాట్ వద్ద ఎలిఫెంట్ ట్రాకర్ చిన్నబ్బ, సదుం మండలం చెరుకువారిపల్లె పంచాయతీకి చెందిన ఎల్లప్ప, కుప్పం మండలం గుడుపల్లెకు చెందిన తిమ్మప్ప నాయుడు, పలమనేరు ఇందిరానగర్‌కు చెందిన సుబ్రమణ్యంతోపాటు మరొకరు ప్రాణాలు కోల్పోయారు. 2023లో పెద్దపంజాణి మండలం ముదిరెడ్డిపల్లె రైతు మార్కెండేయ, కుప్పం మండలం మల్లనూరుకు ఉష, శివలింగం, గుడిపాల మండలం రామాపురానికి చెందిన వెంకటేశు, సెల్వీ, కార్తిక్, వసంత, పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లెకు చెందిన మస్తాన్ ఏనుగుల దాడిలో ప్రాణాలు విడిచారు. గతేడాది చంద్రగిరి మండలం కాశిపెంట వద్ద తమిళనాడుకు చెందిన వేలును, రామకుప్పం పీఎం తాండాకు చెందిన కన్నా నాయక్, పీలేరు శివారులో రెడ్డెప్పరెడ్డి, రామకుప్పం మండలం వీకే తాండాకు చెందిన రెడ్యానాయిక్‌లు మృత్యువాత పడ్డారు. తాజాగా చంద్రగిరి మండలం మామిడిమానుగడ్డ వద్ద ఉపసర్పంచ్ రాకేష్ చౌదరిని ఏనుగులు తొక్కి చంపాయి.

శోకసంద్రంలో కందులవారిపల్లె

- ఉప సర్పంచి రాకేష్ చౌదరికి కన్నీటి వీడ్కోలు



పాడె మోస్తున్న ఎమ్మెల్యే నాని, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు

చంద్రగిరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో ఉప సర్పంచ్ రాకేష్‌చౌదరి మృతి చెందడంతో కందులవారిపల్లె పంచాయతీలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటన తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి శనివారం అర్ధరాత్రి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన తనయుడు వినీల్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, టీడీపీ నాయకులు చేరుకున్నారు. చంద్రగిరి సీహెచ్‌సీలో పోస్టుమార్టం పూర్తయ్యాక ఆదివారం ఉదయం 10 గంటలకు రాకేష్‌చౌదరి భౌతికకాయాన్ని స్వగ్రామమైన మామిడిమానుగడ్డకు తరలించారు. అప్పటికే టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అంత్యక్రియలు ఏర్పాట్లు చేశారు. నాని, రవినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు పాడె మోశారు. భౌతికకాయంపై టీడీపీ జెండా కప్పి అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, నాయకులు సుధారెడ్డి, వీరపల్లి హేమాంబరదరరావు, సుబ్రమణ్యంనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, సింగు సుధా, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, కొండూరు ప్రవీణ్‌రాయల్ తదితరులు నివాళులర్పించారు.

పార్టీ అండగా ఉంటుంది: నాని

రాకేష్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే నాని భరోసా ఇచ్చారు. టీడీపీ నుంచి రూ.5 లక్షల బీమా వస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. మంచి వ్యక్తిని కోల్పోయామని సినీ నటుడు నారారోహిత్ ట్వీట్ చేశారు.కాగా, అటవీ శాఖ అధికారులు తీసుకొచ్చిన రూ.10 లక్షల చెక్కును..విషాదంలో ఉన్న మృతుడి కుటుంబ సభ్యులు తిరస్కరించినట్లు తెలిసింది.

సీఎం చంద్రబాబు సంతాపం

అమరావతి, జనవరి19(ఆంధ్రజ్యోతి): కందులవారిపల్లె ఉప సర్పంచ్ రాకేష్‌చౌదరి ఏనుగుల దాడిలో మృతి చెందటంపై సీఎం చంద్రబాబు సంతాపాన్ని తెలియజేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే పసుపు సైనికుడి మృతి బాధాకరమని, పోరాటపటిమతో అనతి కాలంలోనే గుర్తింపు పొందిన రాకేష్ మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. రాకేష్ కుటుంబానికి అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు.



తీవ్రంగా గాయపడిన ఐశ్వర్య - చికిత్స పొందుతున్న సతీష్, కార్తికేయ

- ప్రమాదంపై సకాలంలో స్పందించని పోలీసులు.. రాని హైవే అంబులెన్సు
- ఆలస్యంగా ఆస్పత్రికి తరలింపు

గంటపాటు రక్తమోడుతూ..!

- ప్రమాద స్థలంలో ఇద్దరు పిల్లల దుర్మరణం
- చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి
- ఒకరి పరిస్థితి విషమం, ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతులు, క్షతగాత్రులది కోయంబత్తూరు



సంఘటన స్థలంలో మృతిచెందిన జీవన్, విశ్వ - ఆస్పత్రిలో మృతి చెందిన కలైవాణి

చంద్రగిరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గోల్డెన్ అవర్. ప్రమాదాలు జరిగినప్పుడు వీలైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఏ మాత్రం ఆలస్యం జరిగిన తీవ్రంగా గాయపడిన వారి ప్రాణాలు పోవచ్చు. కానీ, ఆదివారం సాయంత్రం చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ రవణప్పగారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు మృతిచెందగా.. మిగిలిన క్షతగాత్రులు గంటపాటు రక్తమోడుతూ విలవిలలాడుతూ గడపాల్సి వచ్చింది. హైవేపై గస్తీ తిరిగే పోలీసులు.. హైవే అంబులెన్సు సకాలంలో రాకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తిరుమల శ్రీవారి దర్శనార్థం భార్య ఐశ్వర్య, కుమారులు జీవన్, విశ్వ, అత్త కలైవాణి, బావమరిది సతీష్‌తో కలిసి కోయంబత్తూరుకు చెందిన కార్తికేయ కారులో బయలుదేరారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు రవణప్పగారిపల్లె వద్ద వీరి కారు లారీని ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో ముందు సీట్లో ఉన్న జీవన్(10), విశ్వ(8) అక్కడిక్కడే మృతి చెందారు. మిగిలిన వారు తీవ్ర రక్త గాయాలతో అల్లాడుతున్నా హైవేలో నిత్యం గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు కానీ, కేవలం జాతీయ రహదారిలో జరిగే ప్రమాదాలకు మాత్రమే వచ్చే అంబులెన్స్ కానీ రాలేదు. ఇక, ఈ ప్రమాదంతో కిలోమీటర్ల కొద్దీ వాహనాల రాకపోకలు స్తంభించాయి. కూతవేటు దూరంలోనే టోల్ ప్లాజా ఉంది. గంట పాటూ క్షతగాత్రులకు సాయం అందలేదు. చివరకు స్థానికుల సమాచారంతో పాకాల నుంచి ఆరు గంటలకు 108 అంబులెన్స్ వచ్చింది. క్షతగాత్రులను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 8 గంటల ప్రాంతంలో కలైవాణి(45) మృతి చెందారు. కారు నడుపుతున్న కార్తికేయ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఐశ్వర్య, ఆమె సోదరుడు సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేర పరిశోధనకు మైలురాయి

- తిరుపతిలో రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీని వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్‌షా



తిరుపతి(నేరవిభాగం), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఏర్పాటు చేసిన ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నేర పరిశోధనకు ఉపయోగపడుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. తిరుపతిలో రూ.6.3కోట్లతో నిర్మించిన ఈ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను ఆదివారం ఆయన విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కాగా, ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ.. ఈ ల్యాబ్ ప్రస్తుతం డీఎన్ఏ, ఆడియో, వీడియో పరిశోధనలను కలిపి విస్తృత సేవలు అందించడం వల్ల పోక్సో, ఇతర పెద్ద కేసులకు సంబంధించిన డీఎన్ఏ శాంపిళ్లను పరీక్షించే వెసులుబాటు కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, జేడీ ఈశ్వరమ్మ, డీఎస్పీలు గిరిధర్, వెంకటనారాయణ, రామకృష్ణమాచారి, సీఐలు రాంకిషోర్, రామయ్య, ఎంటీవో రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.



కబడ్డీ.. కబడ్డీ











అటవీ శాఖ స్టాల్ వద్ద జన సందడి

నృత్యోత్సవం



జాతరలా ఫ్లెమింగో ఫెస్టివల్

పోటెత్తిన జనం











సందర్శకులు



సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాల వద్ద ఉత్సాహంగా ఆటలాడుతున్న విద్యార్థులు



పక్షులతో పోటీపడి...

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ రెండో రోజు నేలపట్టు సందర్శకుల రద్దీతో సందడిగా కనిపించింది. చెరువులోని కడపచెట్లమీద పక్షులతో పోటీపడి చెరువు కట్టమీద సందర్శకులు కిటకిటలాడారు. ఉదయం చిరు జల్లుల వల్ల జనం పలుచగా కనిపించినా 11 తర్వాత వెల్లువలా వచ్చారు. పక్షుల కేంద్రంలోని అన్నీ రోడ్లు జనంతో నిండిపోయాయి. సెలవురోజు కావడంతో చెన్నై నుంచి ఉద్యోగుల కుటుంబాలు పెద్ద సంఖ్యలో వచ్చాయి. అలాగే శ్రీసిటీ, మేనకూరు, మాంబట్టు సెజ్‌ల్లోని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు కూడా భారీగానే వచ్చారు. నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, సత్యవేడు, వరదయ్యపాళెం, ఆరంబాకం, గుమ్మిడిపూడి ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 10 వేలమంది నేలపట్టును సందర్శించినట్టు అంచనా. పక్షుల వీక్షణ కోసం ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్ వద్ద సందర్శకులను కంట్రోలు చేయడం కష్టంగా మారింది. చెరువు కట్టమీద ఉన్నవారిని పోలీసులు కట్టకింది మార్గం ద్వారా బయటకు పంపే ఏర్పాటు చేయడంతో ఒత్తిడి తగ్గింది. కేంద్రంలోని పక్షుల చిత్రాలు, ఫిల్మ్ షో సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఇక్కడ కొన్ని స్టాల్స్ ఏర్పాటు చేసివుంటే మరింత ఉపయోగకరంగా ఉండేది.

హైలెస్సో.. హైలెస్సా

వరదయ్యపాళెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తడ మండలం భీములవారిపాలెం ఓడ రేవు నుంచి రెండో రోజూ సందర్శకులు పడవ షికారు చేశారు. 8 పాయింట్ల వద్ద 30 బోట్లను అందుబాటులో ఉంచినట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఒక్కో బోటుకు పది మంది చొప్పున కేటాయించి వారికి సేఫ్టీ జాకెట్ ఇచ్చి షికారుకు తీసుకెళ్లారు. 1.55 కిలోమీటర్ల మేర పడవ షికారు చేశారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు అధికంగా వచ్చారు. నిప్పో పరిశ్రమ తరఫున అన్నదానం నిర్వహించారు. తాగు నీరు, వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచారు. ఇక, కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కూడా బోటు షికారు చేశారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు ఎంతో మానసికోల్లాసంతో గడుపుతారన్నారు.

బోటు షికారుతో ఆనందం

నాలుగేళ్ల తర్వాత ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించడం సంతోషంగా ఉంది. ఈ సారి ప్రభుత్వం బోటు షికారు ఏర్పాటు చేసింది. పక్షుల పండుగ కార్యక్రమంలో పాల్గొని, మేమంతా బోటు షికారు చేయడం ఆనందాన్నిచ్చింది.

- నూర్జహాన్, నాయుడుపేట

శిల్పారామంలో అలరించిన నృత్యప్రదర్శన



తిరుచానూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా ఆదివాకం బైరెడ్డిపల్లి కళాతరంగిని సంస్థ కళా బృందం ఆదివారం ప్రదర్శించిన నృత్యరూపకం అలరించింది. రమ్య, భార్గవి, భరత్, బిందు, శృతి, హేమవతి, జ్యోత్స్న, మేఘన, హేమలత, శైలజ, హేమ, భూమి తదితరులు గణనాయకాయా, బృందావనికి చిందులు నేర్పే వంటి వాటికి కూచిపూడి నృత్యప్రదర్శన, వనారమ్మ వనరే, నేల తల్లి గుండెల్లో, అందాల నరసమ్మో వంటి వాటికి జానపద నృత్యప్రదర్శన చేశారు. వీరిని ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

నేటి నుంచి మండలంలో పశువైద్య శిబిరాలు

పాకాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి ఈనెలాఖరు వరకు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యురాలు డాక్టర్ వి.జానకమ్మ తెలిపారు. సోమవారం అచ్చమ్మ అగ్రహారం మొరవపల్లెల్లో వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. 21న కావలివారిపల్లె, వల్లివేడు 22న గుడివారిపల్లె, పదిపుట్లబైలు, కొత్తవడ్డిపల్లె, 23న పులివర్తివారిపల్లె, చిగరపల్లె, 24న దేశిరెడ్డిపల్లె, గుండ్లగుట్టపల్లె, 25న సామిరెడ్డిపల్లె, సీఎం కొత్తూరు, 27న సూరినేనివారిపల్లె, రవనక్‌నగర్ 28న కెవడ్డేపల్లె, చిన్నగోర్పాడు 29న బైనపల్లె, మణిపిరెడ్డిపల్లె, 30న ముద్దలపల్లె, గానుగపెంట, 31న కృష్ణాపురం, పాకాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పాడి రైతులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేంద్రగుంట - తిరుపతి బస్సులను సర్వీసు రోడ్డులో నడపాలి

పాకాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సులు నేంద్రగుంట సర్వీసు మీదుగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత కోరారు. చిత్తూరు వైపు నుండి వచ్చే బస్సుల్లో నేంద్రగుంటలో దిగేవాళ్లు వుంటేనే సర్వీసు రోడ్డుపైకి వస్తున్నాయని మిగిలిన బస్సులన్నీ పై వేవర్‌పై వెళ్లిపోతున్నాయన్నారు. పెనుమూరు, పాకాల పరిసరాలకు చెందిన గ్రామీణ ప్రాంత రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జాతీయ రహదారిపై వెళ్లే బస్సు సర్వీసులు నేంద్రగుంటలోని సర్వీసు రోడ్డులోని బస్ స్టాప్‌లో ఆగి గాదంకి మీదుగా వెళ్లాలని ఆమె కోరారు.

మాదిగలకు జరిగిన అన్యాయాన్ని వివరిద్దాం: ఎమ్మార్పీఎస్



ఎర్రావారిపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ చట్టబద్ధ వర్గీకరణకు రాష్ట్రప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ రంజన్ మిశ్రా ఎదుట మాదిగల వెనుకబాటుతనం గురించి వివరించాలని ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకుడు పల్లెపాక నాగరాజ పిలుపునిచ్చారు. ఆదివారం గంపలమాదిగ పల్లెలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ సామాజిక వర్గంలో మాదిగలకు అన్ని విధాల అన్యాయం జరిగిందన్నారు. ఈనెల 21న ఏక సభ్య కమిషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనకు రానుందన్నారు. ఈక్రమంలో చిత్తూరుకు భారీగా మాదిగలు, ఉపకులాల వారు తరలి రావాలని కోరారు. సమావేశంలో నాయకులు ఓబులేశు, హరి, పాపయ్యధర్మ, జయేంద్రలోకేష్ పాల్గొన్నారు.

కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారానికి రచనల ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యుదయ రచయితల నుంచి రచనలను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు పి.రోజారెడ్డి తెలిపారు. 2024లో పత్రికల్లో ప్రచురితమై.. పాఠకుల అభిమానం పొందిన కథలు (సంపుటాలు), కవితలు, నవలలు, చందోపద్య కవిత్వం, వచన కవిత్వానికి రానున్న శ్రీరామనవమి పండుగ రోజున కుప్పం రెడ్డెమ్మ జయంతి ఉత్సవాల్లో బహుమతులు అందించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి సి.నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఉత్తమ రచనలకు రూ.10వేలతోపాటు ఘన సత్కారం నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి గల ఉమ్మడి రాష్ట్రాల రచయితలు, సాహితీవేత్తలు తమ రచనలను మూడేసి కాపీల చొప్పున ఫిబ్రవరి పదో తేదీలోపు డాక్టర్ కె.రామలక్ష్మి, రామలక్ష్మి నర్సింగ్‌హోమ్, 17-434 సుందరయ్యవీధి, చిత్తూరు-517001 అనే చిరునామాకు పంపాలని కోరారు.

తిరుమల క్షేత్రంలో కబ్జాలు, అక్రమ కట్టడాలు దారుణం

● తుమ్మా ఓంకార్

తిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుమల దివ్యక్షేత్రంలో భూకబ్జాలు, అక్రమకట్టడాలను ఏమిటని తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మా ఓంకార్ ప్రశ్నించారు. శ్రీనివాసానంద సరస్వతి స్వామి, శివానంద స్వామితో కలిసి ఆదివారం ఆయన తిరుమలలోని గోగర్భం డ్యాం వద్ద నిర్మాణంలో ఉన్న మఠాల వద్దకు వెళ్లారు. అక్కడ జరుగుతున్న కట్టడాలను పరిశీలించారు. ఈసందర్భంగా పవిత్రమైన తిరుమల దివ్యక్షేత్రంలో భూకబ్జాలు జరుగుతున్నా, అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా టీటీడీ అధికారులు ఎందుకు మౌనం దాల్చుతున్నారని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గోగర్భం డ్యాం వద్ద ప్రతివాద భయంకర మఠం నిర్వాహకులు ఊట కాలువను పూడ్చి రేకులతో షెడ్ వేసుకున్నారన్నారు. ఐదు అంతస్తుల కట్టడాలకు పూనుకోవడం చాలా బాధాకరమన్నారు. దీనిపై టీటీడీ ఎస్టేట్ విభాగం అధికారులు స్పందిస్తూ ఇప్పటికే మఠాల నిర్వహణపై టీటీడీ ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవుల మృతి

పాకాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతిచెందిన సంఘటన ఆదెనపల్లె పంచాయతీ పులివర్తివారిపల్లె సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పులివర్తివారిపల్లెకు చెందిన రైతు మునినాయుడికి చెందిన ఆవులు గ్రామ సమీపంలో పొలంలో మేత మేస్తుండగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ పోల్ స్టే వైర్ల నుచంఇ విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదం చోటు చేసుకొంది. వర్షం కురుస్తుండడంతో ఈ సంఘటన జరిగిందని భావిస్తున్నారు. మృతి చెందాయి. ఆవులు మృతిచెందడంతో జీవనాధారం కోల్పోయామని మునినాయుడు జయలక్ష్మీ దంపతులు వాపోతున్నారు.

కేంద్ర జోక్యం ఇదే ప్రథమం: వైసీపీ

తిరుపతి (జీవకోన), జనవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయ వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వ జోక్యం ఇదే మొదటిదని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆదివారం అన్నారు. తిరుమలలో ఘటనలపై విచారణ, సమీక్షకు ఆదేశించడంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతటి అవమానం జరిగిందో అర్థమవుతోందన్నారు. విచారణ అని తెలిసిన వెంటనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ అమిత్‌షాను వేడుకుని ఈ విచారణను రద్దు చేయిస్తూ మరో ప్రకటన తెప్పించారని విమర్శించారు. తిరుమలలో వరుస ఘటనలపై విచారణ ఎక్కడని ప్రశ్నించారు.

స్వర్ణాంధ్రప్రదేశ్‌కి స్వామి ఆశీస్సులు



ఆలయం ముందు మంత్రి సవిత

తిరుమల, జనవరి19(ఆంధ్రజ్యోతి): ఏపీ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారడానికి శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులు తప్పకుండా ఉంటాయని ఆశిస్తున్నట్టు రాష్ట్ర మంత్రి సవిత తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వైకుంఠద్వార దర్శనాల చివరిరోజు శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను చాలా మంది భక్తులతో స్వయంగా మాట్లాడానని, దర్శనం, ప్రసాదాలు, వసతులు, ఇతర ఏర్పాట్లు చాలా బాగున్నాయని సంతృప్తి వ్యక్తంచేసినట్టు మంత్రి చెప్పారు.



తిరుమల మొదటిఘాట్‌లో ఏడవ మైలు మలుపు వద్ద ఆదివారం అదుపుతప్పి కుడివైపునున్న గుంతలోకి దూసుకుపోయి బోల్తాపడిన కారు. -తిరుమల (ఆంధ్రజ్యోతి)

పాత ఘటనలు పునరావృతం కాకూడదు

● సర్వదర్శనం టోకెన్ల జారీ కేంద్రాలు పరిశీలించిన అదనపు ఈవో, ఎస్పీ



విష్ణునివాసంలోని సర్వదర్శనం టోకెన్లు జారీ చేయనున్న కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 19(ఆంధ్రజ్యోతి): పాత ఘటనలు పునరావృతం కాకుండా సర్వదర్శన టోకెన్ల జారీ కేంద్రాల వద్ద పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో తిరుపతిలో సర్వదర్శనం టోకెన్లు జారీ చేయనున్న కేంద్రాల వద్ద మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్వదర్శన టోకెన్లను జారీ చేయనున్న విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్సు, శ్రీవారి మెట్టు ప్రాంతాలను ఆదివారం ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ, టీటీడీ ఐటీ విభాగం అధికారులు, విజిలెన్సు సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశాలున్న భూదేవి కాంప్లెక్సు, విష్ణునివాసం వద్ద అవసరమైన బందోబస్తు, చేపట్టాలని ఎస్పీకి సూచించారు. ఈ విషయంలో టీటీడీ విజిలెన్సు, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. క్యూలైన్ల వద్ద భక్తులను బ్యాచ్‌లు, బ్యాచ్‌లుగా వదలాలని, ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు లేదన్నారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, వెంకట్రావు బాధ్యత తీసుకుని ఎక్కడ ఎంతమంది అవసరమో పరిశీలించి పోలీసులను నియమించాలని ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ సూచించారు. అవసరమైతే ప్రతి క్యూలైన్‌కు ఇద్దరు పోలీసులు, హోంగార్డులను నియమించాలన్నారు. అలిపిరి, ఈస్ట్ సీఐలు రాంకిషోర్, రామకృష్ణ, ఎస్ఐలు నాగార్జున రెడ్డి, బాలకృష్ణ, విజిలెన్సు అధికారులు వున్నారు.

స్విమ్స్, విష్ణు నివాసంలో టీటీడీ ఈవో తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జనవరి19(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ టీటీడీ భక్తుల వసతి గృహం విష్ణునివాసం వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆదివారం వేకువజాము స్విమ్స్‌లో టీటీడీ ఈవో, జేఈవో వీరబ్రహ్మం తనిఖీలు చేపట్టారు. రాత్రి సమయాల్లో వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. వైద్యసేవలపై రోగులను తెలుసుకున్నారు. అత్యవసర సేవల విభాగం, నెఫ్రాలజీ వార్డు, ఐసీయూ, సిర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, కార్డియాలజీ, ఆర్ఐసీయూ తదితర వార్డులను పరిశీలించారు. ఈవోతో పాటు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ రామ్ ఉన్నారు. అక్కడ్నుంచి వీరు విష్ణునివాసం చేరుకున్నారు. హాలు, సెల్లార్‌లోని భక్తులతో ఈవో మాట్లాడారు. దూర ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనం కోసం వచ్చామని, సర్వదర్శనం టోకెన్లు పూర్తయిన కారణంగా తిరుమలలోని క్యూలైన్ల ద్వారా దర్శనం చేసుకునేందుకు వెళుతున్నామని భక్తులు చెప్పారు. దీంతో సోమవారం తిరుమల క్యూలైన్లలోకి నేరుగా వెళ్లి శ్రీవారిని దర్శించుకోవచ్చనే సమాచారాన్ని భక్తులకు నిరంతరాయంగా మైకుల ద్వారా ప్రకటనలు చేయాలని అధికారులను ఈవో ఆదేశించారు.

ఐదు రోజుల పనిదినాలు అమలు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాంకుల్లో ఉద్యోగులకు ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు కోరారు. తిరుపతిలో ఆదివారం కెనరా బ్యాంక్ వర్క్‌మెన్ ఎంప్లాయిస్ యూనియన్ తిరుపతి సర్కిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంబాబు మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. బ్యాంక్‌ల విలీనం ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ నేతలు సంధాని, జేపీ శర్మ, పాండురంగ విఠలయ్య, శ్రీనివాసులురెడ్డి, మున్వర్‌బాషా, ధన్వంత్ కుమార్, లలితలు పాల్గొని ప్రసంగించారు.

అయోధ్య రాముడికి టీటీడీ పట్టు వస్త్రాల సమర్పణ



టీటీడీ తరఫున పట్టువస్త్రాలు తీసుకువస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, జనవరి19(ఆంధ్రజ్యోతి): టీటీడీ తరఫున అయోధ్య శ్రీరాముడికి చైర్మన్ బీఆర్ నాయుడు ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించారు. అయోధ్య ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు శ్రీరామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ బృందం స్వాగతం పలికింది. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి శ్రీరాముడికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఇక, అయోధ్యలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో అర్చకుల బృందం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసస్వామికి స్నపన తిరుమంజనాన్ని సరయూ నది ఒడ్డున నిర్వహించింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5 నుంచి గిరిజన సాంస్కృతికోత్సవం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అక్కులప్ప నాయక్


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ గిరిజన సాంస్కృతికోత్సవాన్ని ఫిబ్రవరి 5వ తేదీ నుంచి రెండు రోజుల పాటు రాజమండ్రిలో నిర్వహించనున్నట్లు గిరిజన విద్యార్థి సంఘం (టీఎస్ఎఫ్) అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ తెలిపారు. ఎస్వీయూలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అరుదైన గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు, కళలను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమానికి గిరిజన విద్యార్థులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మహేంద్ర, చంద్రశేఖర్, చిరంజీవి, మల్లేశ్, నాగేంద్ర, ప్రసాద్, లింగానాయక్ పాల్గొన్నారు.

పట్టించుకోండి సారూ..



సెంట్రల్ బస్టాండు నుంచి బస్సులు వెలుపలకు వచ్చే మార్గంలోని హోటల్ ముందు ఇన్నోవాను ప్రతిరోజూ పగలంతా పార్కు చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కారును అక్కడి నుంచి తరలించాలని సెక్యూరిటీ సిబ్బంది కోరినా యజమాని పట్టించుకోవడం లేదు. అధికారులు వెళ్లి మందలించినా తాళాలు అందుబాటులో లేవని తప్పించుకుంటున్నారు. ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న ఆ కారును తొలగించలేని పరిస్థితుల్లో ఆర్టీసీ యంత్రాంగం ఉందంటే పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏటీఎం రామచంద్రనాయుడిని వివరణ కోరగా చర్యలు తీసుకుంటామన్నారు.

- తిరుపతి(ఆర్టీసీ)



శేషాచల కొండను కప్పేసిన పొగమంచు

మేఘాల సోయగం

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా నగరంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆకాశంలో మేఘాలు కమ్ముకు న్నాయి. అలిపిరి, శేషాచల అడవుల ముఖభాగంలో శ్వేత మేఘాల సోయగం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంది. మేఘాల మాటున తొంగిచూస్తున్న ఏడుకొండల అందాలు అటు కాలినడక, ఇటు వాహనాల్లో ప్రయాణించే భక్తులను మైమరపింపజేశాయి. రాత్రి చలి తీవ్రత పెరిగింది.

- తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)

మూటమీద మూటపెట్టి..

బండెనక బండి కట్టి అన్నట్లు మూటమీద మూటపెట్టి ఎలా తీసుకెళుతున్నారో చూశారా..ఈ దృశ్యం ఆదివారం అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద కనిపించింది. తనిఖీల్లో పట్టుబడిన ప్లాస్టిక్ బాటిళ్లు, వస్తువులు, కవర్లు భారీగా పోగవడం, నిల్వకు స్థలం లేకపోవడంతో భారీ సంచుల్లో కుక్కి ఇలా ట్రాలీలో నింపారు. ఈ దృశ్యాన్ని చూసిన వారు ఈ మూటలు పొరపాటున ఒరిగితే పరిస్థితి ఏమిటా అని చర్చించుకోవడం కనిపించింది.

- తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)



తిరుమల వేంకటేశ్వరస్వామికి శుక్రవారం
హుండీ ఆదాయం: రూ.3.40 కోట్లు
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,931
తలనీలాలు సమర్పించినవారు: 25,717

- తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుమలను కప్పేసిన పొగమంచు



ఆదివారం ఉదయం 10 గంటల వరకు దట్టమైన పొగమంచు తిరుమలను కమ్మేసింది. భక్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉల్లాసంగా గడిపారు. పొగమంచులోని ఆలయం ముందు ఫొటోలు దిగుతూ కనిపించారు. మరోవైపు దట్టమైన పొగమంచు కారణంగా ఘాట్ రోడ్లలో ఎదురుగా వస్తున్న వాహనాలు, ముందు వెళుతున్న వాహనాలు కనిపించక అగచాట్లు పడ్డారు.



- తిరుమల, ఆంధ్రజ్యోతి

28న సుభాష్ పాలేకర్ రాక

ప్రకృతి సేద్యంపై ఎస్వీయూలో సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ఈనెల 28వ తేదీన తిరుపతికి రానున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించే ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని వర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించనుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ ఔత్సాహిక రైతులతో సుభాష్ పాలేకర్ ముచ్చటిస్తారు. పాల్గొనే వారికి ప్రవేశ రుసుం రూ50గా నిర్ణయించారు. ప్రతినిధులకు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామీణ స్థాయికి విస్తరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని సమన్వయకర్తలు డాక్టర్ గంగాధరం, డాక్టర్ పాకనాటి హరికృష్ణ తెలిపారు. ఆసక్తి కల్గిన వారు 9849059573, 9247118843లను సంప్రదించాలని కోరారు.

బార్ల వద్ద రౌడీల ఘర్షణలు

మహిళల పట్ల వెకిలి చేష్టలు



గాయపడిన యువకుడు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో శాంతి భద్రతలు పూర్తిగా కొరవడ్డాయి. రాత్రి 9 తర్వాత మహిళలు రోడ్లపైకి వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఆకతాయిలు, రౌడీలు, రౌడీషీటర్లు మద్యం మత్తులో ఘర్షణలకు దిగుతూ జనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, డీఆర్ మహల్ రోడ్డు, ఐఎస్ మహల్ సర్కిల్, లీలామహల్ నుంచి మంగళం వెళ్లే రోడ్డులో ఇలాంటి ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. వెస్ట్ స్టేషన్ పరిధిలోని ఐఎస్ మహల్ సమీపంలో గల హారిక బార్ వద్ద ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. ప్రధాన రోడ్లపైనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం, పక్కనే అనధికార పర్మిట్ రూములు ఉండడంతో తాగి, రోడ్లపైకి వచ్చి గలాటాలు చేస్తున్నారు. నడిరోడ్లపై ఆటోల్లో కూర్చుని చేతిలో మందుబాటిళ్లు, చెవిలో బ్లూటూత్‌లు పెట్టుకుని దారిన వెళ్లే మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. లీలామహల్ సర్కిల్‌లో ఉమెన్స్ హాస్టళ్లు ఎక్కువగా ఉండడంతో మందుబాబుల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయి. డీఆర్ మహల్ రోడ్డులోనూ అదే స్థాయిలో ఘర్షణలు, కొట్లాటలు జరుగుతున్నాయి. బస్టాండు, రైల్వేస్టేషన్లకు కూతవేటు దూరంలోనే తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఉన్నా మందుబాబుల ఆగడాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈస్ట్ పరిధిలోనే మద్యం దుకాణాలు, బార్లు ఎక్కువగా ఉండడంతో ఘర్షణలు సైతం ఇక్కడే అధికంగా జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నగరం నడిబొడ్డున ఉన్న కొర్లగుంట రోడ్డులోని బార్‌లో ఘర్షణలు, గలాటాలు షరా మామూలైపోయాయని అంటున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న మందుబాబుల విషయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఎస్పీ మణికంఠ దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ





తిరుపతి(ఆర్టీసీ), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులు ముగిశాయి. సోమవారం నుంచి పని రోజులు ప్రారంభం కానున్నాయి. పండుగకు సొంతూళ్లకు వెళ్లిన జనం నగరబాట పట్టారు. ఈ క్రమంలో తిరుపతి సెంట్రల్ బస్టాండు ఆదివారం కిటకిటలాడింది. విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా కనిపించారు. అదనపు బస్సులు ఏర్పాటు చేసినా ప్రయాణికుల అవసరాలకు సరిపోలేదు. యథావిధిగా ఎదురుచూపులు తప్పలేదు. మధ్యాహ్నం 3నుంచి రాత్రి 11 గంటల వరకు బస్టాండులో రద్దీ కనిపించింది. తిరుమలకు వెళ్లే ఏడుకొండల బస్టాండులో యాత్రికుల హడావుడి పెద్దగా కనిపించలేదు. డీపీటీవో జి.నరసింహులు ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్టాండులోనే ఉంటూ బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు.

సీఏ ఫైనల్లో రిషబ్ ఓస్వాల్‌కు ఆలిండియా ప్రథమ ర్యాంకు



సీఎంను కలిసిన విద్యార్థులు, డైరెక్టర్, ప్రిన్సిపాల్ తదితరులు

తిరుపతి(విద్య), జనవరి 19(ఆంధ్రజ్యోతి): సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థి చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన ఆర్.రిషబ్ ఓస్వాల్ ఆలిండియా ప్రథమ ర్యాంకు సాధించాడని కళాశాల అడ్మిన్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్, అడ్మిన్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. అలాగే తమ విద్యార్థులు ఎం.మోహన్ ఆలిండియా 33వ ర్యాంకు, కె.సాయిచరణ్ 34, కె.కృష్ణచైతన్య 40వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. శనివారం సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో కలవగా అభినందించినట్లు చెప్పారు.

'రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు'



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అస్తవ్యస్తమైందని, గాడి తప్పిన పాలనను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందని పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న నిర్ణయం సంతోషించదగ్గదన్నారు. చంద్రబాబు చొరవతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. మంత్రి నారా లోకేశ్ కూడా రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయించారన్నారు. యువతకు ఉపాధి కోసం పరిశ్రమలను తీసుకురావడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హేమంత్‌కుమార్, జయరాంయాదవ్, రవిశంకర్, చెంగయ్య పాల్గొన్నారు.

యోగి వేమన జీవితం స్ఫూర్తిదాయకం



యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు కవి, సంఘ సంస్కర్త యోగి వేమన జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. యోగి వేమన జయంతిని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేమన రాసిన తెలుగు పద్యాలు ఆదర్శమన్నారు. భారతీయ తత్వవేత్తగా, కవిగా ఆయన పేరు పొందారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి



సమావేశంలో సంఘ నాయకులు

తిరుపతి(విద్య), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) డిమాండ్ చేసింది. ఏపీటీఎఫ్ కార్యకర్తల సమావేశం కరకంబాడీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవు, డీఏ పెండింగ్ బకాయిలను చెల్లించాలని కోరారు. స్థానిక సంస్థల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. 2003 డీఎస్సీ అభ్యర్థులకు పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగల్రాయ, ఐఫియా చీఫ్ ప్యాట్రన్ కె.సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి సురేష్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు నరేంద్రన్, జిల్లా అదనపు కార్యదర్శి కేశవరెడ్డి పాల్గొన్నారు.

'అమిత్‌షా గోబ్యాక్'



నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

తిరుపతి (ఆటోనగర్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి 'అమిత్‌షా గోబ్యాక్' అంటూ వామపక్ష నేతలు నినాదాలు చేశారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు.. బ్యానర్లు ప్రదర్శించారు. నేతలు ఏ రామానాయుడు, వీ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించి మోసం చేసిన అమిత్‌షా ఇక్కడకు ఏ మొహం పెట్టుకుని వస్తారని ప్రశ్నించారు. నిండు సభలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అంటే గౌరవం లేకుండా మాట్లాడడం బాధాకరమన్నారు. ఇలాంటి నాయకులను రాష్ట్ర ప్రజలు అడ్డుకుని తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో టి.సుబ్రమణ్యం, సి.పెంచలయ్య, వేణు, కె.రాధాకృష్ణ, శివారెడ్డి, బుజ్జి, హేమలత, ఎన్‌డీ రవి, కేవై రాజా, శివ, సి.కాళయ్య తదితరులు పాల్గొన్నారు.

'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రబృందం సందడి



తిరుపతి అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రబృందం ఆదివారం నగరంలో సందడి చేసింది. దర్శకుడు అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు బీమ్స్, నిర్మాతలు శిరీష్, దిల్‌రాజు, తారలు మీనాక్షి చౌదరి, ఐశ్వర్యరాజేష్, హాస్యనటుడు శ్రీనివాసులరెడ్డి, బాలనటుడు రేవంత్ మధ్యాహ్నం జైశ్యామ్ థియేటర్‌ను సందర్శించారు. స్క్రీన్ వద్ద నుంచి ప్రేక్షకులను పలకరించారు. సినిమాను సూపర్ హిట్ చేసినందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ రెవెన్యూపరంగా ఈ సినిమా ఎఫ్2ను క్రాస్ చేసిందన్నారు. ప్రేక్షకుల కోరిక మేరకు డైలాగులు చెబుతూ.. పాటలు ఆలపిస్తూ అలరించారు. చివర్లో చిత్రబృందాన్ని గజమాలతో సత్కరించారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సినీ నిర్మాత ఎన్వీ ప్రసాద్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టీటీడీ విశ్రాంత డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త యోగి వేమన



వేమన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కుల, మత, వర్గ రహిత సమాజాన్ని కోరుకున్న యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త అని వక్తలు పేర్కొన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తిరుపతిలో వేమన జయంతి సభను ఆదివారం నిర్వహించారు. వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, తెలుగు పరిశోధక విద్యార్థి జి.రమేష్‌బాబు, ఆకాశవాణి రిటైర్డు అధికారులు నడ్డి నారాయణ, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. కఠిన వాస్తవాలను పద్యాల రూపంలో వేమన చెప్పారని అన్నారు. అశాస్త్రీయ భావాలను పద్యాలతో ఆనాడే ఖండించారని తెలిపారు. పద్యాల ద్వారా వేమన జనంలో బతికే ఉన్నారని చెప్పారు. పలువురు వేమన పద్యాలను ఆలపించారు. కార్యక్రమంలో మోహనమూర్తి, మునిలక్ష్మి, తహసున్నీసా, వెంకటరమణ, పంచముఖేశ్వరరావు, సుబ్రమణ్యం, లక్ష్మీదేవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో మృతదేహం

తిరుపతి(సెంట్రల్) జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి రైల్వేస్టేషన్ విశ్రాంతి హాలులో మృతదేహాన్ని గుర్తించారు. జీఆర్పీ సీఐ ఆశీర్వాదం వివరాల మేరకు.. విశ్రాంతి హాలులో మృతదేహం ఉన్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం వచ్చింది. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. జేబులో ఉన్న మొబైల్ ఆధారంగా వివరాలు ఆరా తీశారు. మృతుడు అన్నమయ్య విద్యుత్ సర్కిల్ పరిధిలోని కన్నెమడుగు సెక్షన్‌లో ఏఎల్ఎంగా విధులు నిర్వహిస్తున్న డి.హరినాథరెడ్డి(55)గా గుర్తించారు. గత ఏడాది సెప్టెంబరులో ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని రుయాకు తరలించి, శవ పంచనామా చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

అ'పూర్వ' సమ్మేళనం



శ్రీగోవిందరాజస్వామి ఉన్నత పాఠశాల 2001-02 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు 23 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం స్థానిక ఎస్జీఎస్ హైస్కూల్ ఆవరణలో దాదాపు 200 మంది కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. వారి ఉపాధ్యాయులు, ప్రస్తుత స్కూల్ హెడ్మాస్టర్ చంద్రయ్యను ఆహ్వానించి, ఘనంగా సత్కరించి, ఆశీర్వాదం తీసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను మననం చేసుకుంటూ ఆనందంగా గడిపారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

4.6 కిలోల గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం),జనవరి19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 4.6 కిలోల గంజాయిని అలిపిరి పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకుని, విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎస్‌ఐ లోకేష్‌బాబు వివరాల మేరకు.. బొమ్మగుంటకు చెందిన కణాల పురుషోత్తమరెడ్డి, కణాల రామ్మోహన్‌రెడ్డి, బండి యోగి, పోలావీధికి చెందిన రాజేంద్రబాబు బయట ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి తిరుపతిలో విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఆదివారం అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు కట్టపుట్టాలమ్మ ఆలయం వద్ద తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన కణాల రామ్మోహన్ రెడ్డి, రాజేంద్రబాబులను అదుపులోకి తీసుకుని విచారించారు.ఒడిశా నుంచి తెచ్చి విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన 4.6 కిలోల గంజాయిని వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ చెప్పారు.



జస్టిస్ ఎంజీ ఉమా



దానయ్య - రాజ్‌కుమార్

త్వరలో 'ఓ.జీ' విడుదల తేదీ : నిర్మాత దానయ్య

తిరుమల, జనవరి19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ఉమా, సినీ నిర్మాత దానయ్య, నటుడు రాజ్‌కుమార్ ఉన్నారు. దర్శనం అనంతరం నిర్మాత డీవీవీ దానయ్య ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, పవన్‌కల్యాణ్ 'ఓ.జీ'చిత్రవిడుదలతేదీని త్వరలోనే ప్రకటిస్తామనితెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీనగర్‌లో ఇంటి ముందు ఆపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం చోరీచేశారు.యూనివర్సిటీ సీఐ రామయ్య కథనం మేరకు.. ఎస్వీనగర్‌కు చెందిన భార్గవ ప్రసాద్ శనివారం రాత్రి తన బైక్‌ను ఇంటి ముందు పార్కు చేశాడు. ఉదయం కనిపించకపోవడంతో వర్సిటీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గోడ ధ్వంసం చేశారని ఫిర్యాదు..: తిరుపతిలోని హథిరాంజీ మఠం భూముల్లో ఉన్న ఇంటి గోడను ధ్వంసం చేశారని మఠం ఏఈవో శ్రీనివాసరెడ్డి వర్సిటీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మఠం భూమిలో జగదీశ్వరరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి ఇళ్లు నిర్మించుకుని ఉన్నారు. చంద్రమోహన్ రెడ్డి ఇంటికి ముందు ఉన్న ప్రహరీ గోడను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఏఈవో ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



కబడ్డీ.. కబడ్డీ









నృత్యోత్సవం





అటవీ శాఖ స్టాల్ వద్ద జన సందడి



జాతరలా ఫ్లెమింగో ఫెస్టివల్

పోటెత్తిన జనం










సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాల వద్ద ఉత్సాహంగా ఆటలాడుతున్న విద్యార్థులు



సందర్శకులు



పక్షులతో పోటీపడి...

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ రెండో రోజు నేలపట్టు సందర్శకుల రద్దీతో సందడిగా కనిపించింది. చెరువులోని కడపచెట్లమీద పక్షులతో పోటీపడి చెరువు కట్టమీద సందర్శకులు కిటకిటలాడారు. ఉదయం చిరు జల్లుల వల్ల జనం పలుచగా కనిపించినా 11 తర్వాత వెల్లువలా వచ్చారు. పక్షుల కేంద్రంలోని అన్నీ రోడ్లు జనంతో నిండిపోయాయి. సెలవురోజు కావడంతో చెన్నై నుంచి ఉద్యోగుల కుటుంబాలు పెద్ద సంఖ్యలో వచ్చాయి. అలాగే శ్రీసిటీ, మేనకూరు, మాంబట్టు సెజ్‌ల్లోని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు కూడా భారీగానే వచ్చారు. నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, సత్యవేడు, వరదయ్యపాళెం, ఆరంబాకం, గుమ్మిడిపూడి ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 10 వేలమంది నేలపట్టును సందర్శించినట్టు అంచనా. పక్షుల వీక్షణ కోసం ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్ వద్ద సందర్శకులను కంట్రోలు చేయడం కష్టంగా మారింది. చెరువు కట్టమీద ఉన్నవారిని పోలీసులు కట్టకింది మార్గం ద్వారా బయటకు పంపే ఏర్పాటు చేయడంతో ఒత్తిడి తగ్గింది. కేంద్రంలోని పక్షుల చిత్రాలు, ఫిల్మ్ షో సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఇక్కడ కొన్ని స్టాల్స్ ఏర్పాటు చేసివుంటే మరింత ఉపయోగకరంగా ఉండేది.

హైలెస్సో.. హైలెస్సా

వరదయ్యపాళెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తడ మండలం భీములవారిపాలెం ఓడ రేవు నుంచి రెండో రోజూ సందర్శకులు పడవ షికారు చేశారు. 8 పాయింట్ల వద్ద 30 బోట్లను అందుబాటులో ఉంచినట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఒక్కో బోటుకు పది మంది చొప్పున కేటాయించి వారికి సేఫ్టీ జాకెట్ ఇచ్చి షికారుకు తీసుకెళ్లారు. 1.55 కిలోమీటర్ల మేర పడవ షికారు చేశారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు అధికంగా వచ్చారు. నిప్పో పరిశ్రమ తరపున అన్నదానం నిర్వహించారు. తాగు నీరు, వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచారు. ఇక, కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కూడా బోటు షికారు చేశారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు ఎంతో మానసికోల్లాసంతో గడుపుతారన్నారు.

బోటు షికారుతో ఆనందం

నాలుగేళ్ల తర్వాత ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించడం సంతోషంగా ఉంది. ఈ సారి ప్రభుత్వం బోటు షికారు ఏర్పాటు చేసింది. పక్షుల పండుగ కార్యక్రమంలో పాల్గొని, మేమంతా బోటు షికారు చేయడం ఆనందాన్నిచ్చింది.

- నూర్జహాన్, నాయుడుపేట









సత్య మాస్టర్ నృత్య ప్రదర్శన - విద్యార్థుల నృత్య ప్రదర్శన - పాటలు పాడుతున్న గాయకులు శృతి, సావిత్రి, శ్రీనివాస్, బాల గాయకురాలు సాయి వాగ్దేవి,





సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న ఎమ్మెల్యేలు విజయశ్రీ, రామకృష్ణ, సునీల్‌కుమార్, మాజీ ఎంపీ నెలవల, మాజీ మంత్రి పరసా - హాజరైన జనం

ఉర్రూతలూగించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగ్ ఫెస్టివల్ భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు జనాలను ఉర్రూతలూగించాయి. ప్రముఖ నేపథ్య గాయకులు రఘు కుంచె, మంగ్లీ, బాల గాయకురాలు సాయి వాగ్దేవి, శ్రీనివాస్, శృతి, గాయత్రి ఆలపించిన పాటలు అలరించాయి. బిగ్‌బాస్ ఫేమ్ అప్పురెడ్డి, వేణు వ్యాఖ్యాతలుగా వ్యవహరించగా, సినీనటి అనసూయ భరద్వాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే సినీ కొరియో గ్రాఫర్ సత్యమాస్టర్ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కాగా, సాంస్కృతిక కార్యక్రమాలకు జనం పెద్దసంఖ్యలో రావడంతో కళాశాల మైదానం పూర్తిగా నిండిపోవడంతో చుట్టుపక్కల రోడ్లన్నీ జనసందోహంతో నిండిపోయాయి. ఓ దశలో తోపులాటలు జరిగాయి. పోలీసులు అప్రమత్తమై పరిస్థితి చక్కదిద్దారు. సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, కురుగొండ రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, పెంచలకోన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తానంకి నానాజీ తదితరులు హాజరై కార్యక్రమాలను తిలకించారు.

పుత్తూరు వార్తలు

ఉదయం నడక ఆయుష్షును పెంచుతుంది



సమావేశంలో యూరాలజిస్ట్ సుబ్రమణ్యం

పుత్తూరు, జనవరి19 (ఆంధ్రజ్యోతి): ఉదయం నడకను దినచర్యగా పాటిస్తే ఆయుష్షు పెరుగుతుందని ప్రముఖ యూరాలజిస్ట్, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం అసోసియేషన్ భవనంలో జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నడక వల్ల శరీరంలోని ప్రతి అవయవంలో కదలికలు వచ్చి చైతన్యవంతం అవుతాయని వివరించారు. మూత్రపిండాలను ఆరోగ్యంగా వుంచుకునేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడుగా కేఎల్ఎన్‌మూర్తి, కార్యదర్శులుగా రఫీ అహమ్మద్, మునికృష్ణయ్య, కోశాధికారిగా గుణశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా గోపీకృష్ణలు ప్రమాణస్వీకారం చేశారు. డాక్టర్లు శ్రీనివాసులురెడ్డి, ఆర్ముగం, రవిరాజు, గవర్నర్ మాధవనాయుడులు పాల్గొన్నారు.

అమిత్ షా.. గో బ్యాక్



పుత్తూరు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి 'అమిత్‌షా గో బ్యాక్' అని సీపీఎం కార్యదర్శి భాస్కర్, సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ నినదించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను అవమానించడానికి నిరసనగా ఆదివారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ముకుంద, చంద్రబాబు, దినేష్, బాబు, సీపీఎం నాయకులు విజయ్, సుబ్రమణ్యం, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అకాల వర్షం .. అన్నదాతకు కష్టం

పుత్తూరు టౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో మండలంలోని అన్న దాతలకు నష్టం వాటిల్లింది. శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో నువ్వులు, వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతిందని రైతులు వాపోయారు. ఇప్పుడిప్పుడే వస్తున్న మామిడి పూత రాలిపోయిందని విచారం వ్యక్తం చేశారు.

సదాశివకోన పాలకవర్గం

శివరాత్రిలోపు ఏర్పడేనా?



పుత్తూరు టౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన సదాశివకోన దేవస్థానం నూతన పాలకవర్గం ఏర్పాటుపై ఆశావహులు, శివ భక్తులు ఎదురు చూస్తున్నారు. ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రమైన సదాశివకోన సహజ సిద్ధంగా వెలసిన జలపాతం, అటవీ ప్రాంతం ఆహ్లాదకరమైన వాతా వరణంతో ఇటు ఆధ్యాత్మికంగా భక్తులను, అటు పచ్చని అటవీ అందాలతో పర్యావరణ ప్రేమికులను అలరిస్తోంది. అందుకే సదాశివా కోన ప్రముఖ టూరిజం కేంద్రంగా మారింది. ఏటా శివరాత్రి పర్వదినం, చిత్రాపౌర్ణమి రోజుల్లో సమీప గ్రామాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు కష్ట, నష్టాలకు ఓర్చి దట్టమైన అటవీ ప్రాంతంలోని స్వయంభువుగా వెలసిన సదాశివుడిని దర్శించుకుంటూ ఉంటారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా వేలాది మంది భక్తుల తాకిడి ఉంటుంది. సుమారుగా 25 లక్షల మేరకు ఆదాయం వస్తోంది. ఈ ఆలయాన్ని 1999లో దేవాదాయ, ధర్మదాయ శాఖ పరిధిలోనికి అప్పటి ఎమ్మెల్యే గాలి ముద్దుకృష్ణమనాయుడు విలీనం చేశారు. అప్పటి నుంచి ఎండోమెంట్ పరిధిలో నిర్వహణ జరుగుతోంది.

పాలకవర్గం లేక..

ప్రస్తుతం పాలకవర్గం లేక అధికారుల పర్యవేక్షణలో ఆలయ నిర్వహణ సాగుతోంది. ప్రత్యేకించి మహాశివరాత్రి సందర్భంగా వేలాది భక్తుల తాకిడి ఉండనుంది. పాలకమండలి లేకపోవడంతో భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం కాస్త కష్టంగా ఉంటుంది. పాలక వర్గం ఏర్పాటు ఇప్పట్లో వీలుకానా పక్షంలో కనీసం తాత్కాలిక ఉత్సవ కమిటీని నియమించేలా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చొరవ చూపాలని సదాశివకోన భక్తులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

పుత్తూరు అర్బన్, జనవరి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉత్తరపు కండ్రిగ సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు.. తిరుత్తణి సమీపంలోని మద్దూరుకు చెందిన ప్రకాష్(46) స్థానిక గణపతి నగర్‌లో ఉంటున్న అన్న సెల్వారెడ్డి ఇంటికి మూడు రోజుల క్రితం వచ్చాడు. తర్వాత ఇంటికి వెళ్లలేదు. అతనికి కొంచెం మతిస్థిమితం లేదు. వివాహం కాలేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 2 గంటల సమయంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని చనిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



పుత్తూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలం వేపగుంట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై పడి వున్న సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. చెన్నై వైపు వెళ్లే రైలు నుంచి మృతుడు జారి పడి ఉంటాడని భావిస్తున్నారు. సిమెంటు కలర్ టీ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంటు మృతుడు ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై నల్లని పుట్టు మచ్చలు ఉన్నాయి. మృతదేహాన్ని రేణిగుంట రైల్వే పోలీసులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఫ్లెమింగో ఫెస్టివల్లో శ్రీసిటీ స్టాల్‌కు విశేష స్పందన

శ్రీసిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఫ్లెమింగో ఫెస్టివల్ మైదానంలో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, పర్యాటకులు, సామాన్య ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ స్టాల్‌లో చాక్లెట్లు, ఆహార పదార్థాలు, ఎయిర్ కండిషనర్లు, ఆటో మొబైల్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్, లైట్ ఇంజనీరింగ్ రంగాల ఉత్పత్తుల నమూనాలతో శ్రీసిటీ ప్రగతిని దృశ్య మాధ్యమంగా అద్భుతంగా ప్రదర్శించారు. పారిశ్రామిక విజయాలతో పాటు, సుస్థిరత, సామాజిక సంక్షేమం పట్ల శ్రీసిటీ నిబద్ధతను స్టాల్ హైలెట్ చేసింది. పరిశ్రమలతో పాటు హరితహిత కార్యక్రమాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ప్రాజెక్టులు, ప్రకృతి సంరక్షణ, జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలను ప్రతిబింబించే ఆకర్షణీయ ఫోటో డిస్‌ప్లేలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శ్రీసిటీ ప్రస్థానాన్ని వివరిస్తూ సాగిన వీడియో ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. కాగా శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రదర్శన ప్రాంగణంలో నీరు నిలిచినా సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా ఫెస్టివల్ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



శ్రీసిటీ స్టాల్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

దాడి చేసి సెల్‌ఫోన్, నగదు అపహరణ

గూడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు సమీపంలో అదే గ్రామస్తుడిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి సెల్‌ఫోన్, నగదు లాక్కెళ్లిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ వివరాల మేరకు... మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన మనోహర్ గూడూరులోని ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుంటాడు. ఆదివారం వేకువజామున పనులు ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా చెన్నూరు సమీపంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి మనోహర్‌ను అడ్డగించి దాడి చేశారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, రూ.70 నగదు లాక్కెళ్లారు. గాయపడిన మనోహర్‌ను ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

గూడూరు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సునీతసేవా సంస్థ కార్యాలయంలో ఈనెల 25వ తేదీ నుంచి మహిళలకు బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు 9440455947 నంబరును సంప్రదించాలన్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు



డివైడర్లపై కూర్చొని బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు

కోట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డులో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉన్న బస్ షెల్టర్‌ను ఏడాదిన్నార క్రితం శిథిలావస్థకు చేరుకోవడం ఆర్‌అండ్‌బీ అధికారులు కూల్చివేశారు. కానీ కొత్త బస్‌షెల్టర్ నిర్మాణానికి చర్యలు చేపట్టలేదు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ప్రయాణికులకు కూడలి ప్రాంతమైన క్రాస్‌రోడ్డులోని బస్ షెల్టర్ ఎంతో ఉపయోగకరం. అయితే ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండ, వానకు ఇబ్బందులు పడుతూ డివైడర్లపైనే కూర్చొని బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కోట క్రాస్‌రోడ్డులో బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దుప్పట్ల పంపిణీ

చిల్లకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటక్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న నక్కలవారికండ్రిగ గిరిజన కాలనీవాసులు ఆదివారం బాషా, బషీరా సహకారంతో కృపసేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసులు, గోపాల్, రమేష్, రమణయ్య, గువరయ్య, శంకరయ్య, చెంచయ్య, ఈశ్వరయ్య, సురేంద్రబాబు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం



వరదయ్యపాళెం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కార్యకర్త కుటుంబానికి టీడీపీ అండగా నిలిచింది. మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బాలాజీ నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబానికి పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్, టీడీపీ సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు తమ సొంత నిధులు రూ.1.25లక్షలు సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీపతిబాబు, యుగంధర్‌రెడ్డి, నిర్మల్‌కుమార్, మల్లికార్జున్, కుమార్, నరసరాజు పాల్గొన్నారు.

అమిత్‌షాకు ముక్కంటి ప్రసాదాలు



హోంమంత్రి అమిత్‌షాకు ముక్కంటి ప్రసాదాలు అందజేస్తున్న గుడ్లూరు మయూర్

శ్రీకాళహస్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబును ఆదివారం ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ మయూర్ విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అమిత్‌షాను ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు. మహాశివరాత్రి ఉత్స వాలకు ఆయనను ఆహ్వానించారు. అదేవిధంగా కేంద్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, బండి సంజయ్‌ను కూడా మర్యాద పూర్వకంగా కలిశారు. తమ విద్యాసంస్థలు, హాస్పిటల్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. వారు అందుకు సానుకూలంగా స్పందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



కేవీబీపురం, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని అంజూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2009-10 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠ శాలలో ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యా యులు మస్తానయ్య, హిందీ పండితులు మల్లికార్జున్, ఉపాధ్యాయులు రవి, శివకుమార్, సుబ్రహ్మ ణ్యం, కుమారిని దుశ్శాలువాతో సత్కరించారు. 15 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఎంతో ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. పూర్వవిద్యార్థులు మోహన్, మునికుమార్, మునీంద్ర, రాజశేఖర్, బాలాజీ, ప్రశాంత్, రాజేష్, సుధీర్ సమావేశాన్ని నిర్వహించారు.

మాజీ ఎంపీపీ ప్రేమావతమ్మ సేవలు చిరస్మరణీయం



ప్రేమావతమ్మ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మాజీ ఎంపీపీ ప్రేమావతమ్మ సేవలు ఆదర్శప్రాయమని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కీర్తించారు. ఆదివారం మండలంలోని వేలూరులోని ఆమె స్వగృహంలో జరిగిన శుభ స్వీకరణ కార్యక్రమంలో ఎమెల్యే పాల్గొన్నారు. ఆమెకు నివాళు లర్పించారు. ప్రేమావతమ్మ కుమారుడు, తిరుపతి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్ నాయుడు, భర్త శ్రీరాములునాయుడు, మరిది ప్రభాకర్ నాయుడు, చిన్నకుమారుడు రమేష్ నాయుడులను పరామ ర్శించారు. వీరితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు.

మేర్లపాక చెరువులో గౌరమ్మ నిమజ్జనం



గౌరమ్మను జలదిలో కలపడానికి తరలిస్తున్న గ్రామస్తులు

ఏర్పేడు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేర్లపాక చెరువులో గౌరమ్మ నిమజ్జనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా జరిగే గౌరమ్మకు గ్రామస్తులు ఆదివారం పలు రకాల అభిషేకాలు, పూజలు చేశారు. పాడి, పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని పూజలు నిర్వహించారు. అనంతరం గౌరమ్మ ప్రతిమను జలదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్య క్రమంలో స్థానిక టీడీపీ నాయకులు రమణయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురంపై లేజర్‌కాంతుల శోభ





శ్రీకాళహస్తి, జనవరి 19(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయ రాజ గోపురం పై లేజర్ కాంతుల శోభ భక్తులను ఆకట్టు కుంటోంది. వచ్చే నెలలో మహా శివరాత్రి ఉత్సవాలు జరగనున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి శివరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారులతో ఇప్పటికే సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో ఉత్సవాల నిర్వహణ కోసం విద్యుత్ అలంకరణలకు టెండర్లు ఆహ్వానించి ఆలయం నుంచి నగదు చెల్లించేవారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని నిర్ణయించారు. ముంబయికి చెందిన సంస్థ ద్వారా విద్యుత్ అలంకరణ పరికరాలను ఆలయం ద్వారా కొనుగోలు చేసి పదేళ్ల పాటు ఎలాంటి ఖర్చు లేకుండా వాటినే బ్రహ్మోత్సవాల సమయం లో అలంక రణకు ఉపయోగించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు ఆదివారం రాజగోపురంపై లేజర్ కాంతులతో వివిధ ఆధ్యాత్మికత, దేవతామూర్తుల చిత్రాలను సుందరమైన రంగులతో ప్రదర్శించారు. ఇవి భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఈ లేజర్ లైటింగ్‌ను పరిశీలించారు.



లేజర్ లైటింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎస్సీ వర్గీకరణపై రేపు కమిషన్ విచారణ

సత్యవేడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ఈనెల 21న (రేపు) చిత్తూరు కలెక్టరేట్ పీజీఆర్ఎస్ మీటింగ్ హాలులో ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ప్రజల నుంచి విన తులు స్వీకరిస్తారని సత్యవేడు ఏఎస్‌డబ్ల్యుఓ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల పౌరులు, సంఘాలు, సంస్థలు వారి అభిప్రాయాలను వినతి రూపంలో కమిషన్‌కు సమర్పించుకోవ చ్చని ఆయన తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన



ఏర్పేడు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రహదారి మాసోత్సవాలను పురస్కరించుకుని ఏర్పేడు సమీపంలోని టోల్‌గేట్ వద్ద ఆదివారం జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్, ఎంవీఐ దామోదర్‌నాయుడు రహదారి భద్రతపై ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ ఆటోలలో ప్రయాణికులను పరిమితికి మించి తీసుకెళ్లరాదన్నారు. వాహనానికి సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఆరు లేన్ల జాతీయ రహదారి నిర్మించిన నేపథ్యంలో గ్రామాల నుంచి జాతీయ రహదారి కలిసే వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. సర్వీసు రోడ్డు ఉన్న ప్రాంతంలో ఆ మార్గంలోనే వెళ్లాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యోగివేమనకు ఘన నివాళి



శ్రీకాళహస్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో ఆదివారం యోగి వేమన 373 జయంతిని నిర్వహిం చారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుంభాభిషేకం



కలశానికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పనసకోనలోని హరిహర తీర్థంలో వెలసిన హరిహరేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం ఆదివారం ఆగమోక్తంగా జరిగింది. ఈ ఆలయాన్ని పునర్నిర్మించడంతో ఈ పూజలు చేశారు. ముందుగా కలశ స్థాపన చేసి వేదపండితులు పూజలు చేశారు. ఆలయ శిఖరాలకు అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



శ్రీకాళహస్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలి గ్రామానికి చెందిన రైతు దామోదర్‌రెడ్డి తన పొలం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ధ్వంసం చేశారు. రాగిని దోచుకెళ్లారు. కాగా ఇటీవల శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలో ట్రాన్స్ ఫార్మర్లు, స్టార్టర్లు వరుసగా ధ్వంసం అవుతూనే ఉన్నాయి. మూడు నెలల కాలంలో సుమారు వంద ఘటనలు జరిగాయి. దీనిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

ప్రధాన రహదారికి మరమ్మతులు చేయండి



రాజులకండ్రిగ వద్ద దెబ్బతిన్న శ్రీకాళహస్తి-పిచ్చాటూరు రహదారి

కేవీబీపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చాటూరు -శ్రీకాళహస్తి ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినింది. రోడ్డు కుంగి పెద్దపెద్ద గుంతలు దర్శన మిస్తున్నాయి. నెలరోజులు గడిచినా అధికారులు పట్టించుకోక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. రోడ్డుపై నీరు ఉండటంతో గుంతలు ఎక్కడో తెలియక వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఇటీవల ఆర్అండ్‌బీ ఈఈ వచ్చి పరిశీలించి వెళ్లి సుమారు 15 రోజులు గడుస్తోంది. అయినా ఇంతవరకు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వినాయకుడికి అంకురార్పణ పూజలు







వినాయకస్వామి మండపం- పూజలు చేస్తున్న వేదపండితులు - ప్రత్యేక అలంకారంలో వినాయకస్వామి

శ్రీకాళహస్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరి కుమారస్వామి ఆలయం వద్ద ఉన్న వినాయకస్వామి మండపంలో వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా స్వామివారికి కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ కుంభాభిషేకం కోసం ముందుగా అంకురార్పణ పూజలు ఆదివారం వైభవంగా జరిగాయి. తొలుత వేదపండితులు మండపం వద్ద కలశ స్థాపన చేసి పూజలుచేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా గో బ్యాక్ : సీపీఎం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్ కూడలి వద్ద ఆదివారం వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, రాధమ్మ, రాపూరు సుబ్రహ్మణ్యం, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల నాయకులు అమిత్ షా గో బ్యాక్ అనే నినాదాలను హోరెత్తించారు. సీపీఎం నాయకులు వెంకటరమణ, దిలీప్ బాషా, సెల్వరాజ్ పాల్గొన్నారు.

అధికారనందికి ప్రత్యేక పూజలు





పూజలు చేస్తున్న వేదపండితులు (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకారంలో అధికార నంది

శ్రీకాళహస్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రధాన ద్వారం కంచుగడప వద్ద ఉన్న అధికార నంది కుంభాభిషేకంలో భాగంగా ఆదివారం కలశ పూజ, పూర్ణాహుతి జరిగింది. అనంతరం అధికారనందికి పలు రకాల అభిషేకాలు నిర్వ హించి ప్రత్యేకంగా అలంకరిం చారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నాగ భూషణం ఆలయప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్ కరుణాకరన్ గురుకుల్, అర్చకులు అభిషేకం, గురుకులు, సురేష్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాళెంలో ఉచిత వైద్యశిబిరం



వరదయ్యపాళెం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలం లోని కంచరపాళెంలో మాజీ సర్పంచ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దశరథన్ అధ్యక్షతన సూళ్లూరుపేట ఎస్ఎస్‌కే డయాబెటిస్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు ఎస్ఎస్‌కే సురేష్‌బాబు యాదవ్ షుగర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ శిబిరంలో షుగర్, థైరాయిడ్, బీపీ, కిడ్నీ, లివర్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర, సాయికృష్ణ, శ్వేత పాల్గొన్నారు.

వర్షానికి అధ్వానంగా మారిన పీవీకండ్రిగ రోడ్డు



పాఠశాల దగ్గర రోడ్డు దెబ్బతినడంతో నిచిలిపోయిన వర్షపు నీరు



గ్రామంలో ప్రధాన రోడ్డులోని గుంతలు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీవీకండ్రిగ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి శనివారం కురిసిన వర్షానికి అధ్వానంగా మారింది. ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కేటీ రోడ్డు నుంచి ఆలత్తూరు, పీవీకండ్రిగ మీదుగా పుత్తేరి గ్రామానికి పదేళ్ల క్రితం తారు రోడ్డు వేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డులో గుంతలు ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. పీవీకండ్రిగ పాఠశాల నుంచి గ్రామంలో 250 మీటర్ల వరకు ఈ రోడ్డు పోతుంది. గతంలో కురిసిన వర్షాలకే రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డులో ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి పోవడంతో వృద్ధులు, పిల్లలు నడవలేక అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. కనీసం గ్రామంలో ఉన్న ప్రధాన రోడ్డుకు అయినా మరమ్మతులు చే పట్టాలని కోరుతున్నారు.

పెద్దపాలేడు దళితవాడలో
పారిశుధ్యం అధ్వానం



గ్రామం మధ్యలో ఉన్న మురుగు నీరు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపాలేడు దళితవాడలో అధ్వాన పారిశుధ్యంతో ప్రజలు జ్వరాలబారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. దళిత వాడలో వంద కుటుంబాలు పైగా ఉన్నాయి. వీధుల్లోనే పేడ దిబ్బలు ఉండడంతో దోమలు వృద్ధి చెంది జనం జ్వరాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. పది రోజుల నుంచి ప్రతి ఇంట్లో ఒకరిద్దరు జ్వరాలతో మంచం పట్టారు. చేతిబోరు పక్కనే పేడ దిబ్బ వేయడంతో తాగునీరు కలుషితమవుతోంది. అధికారులు స్పందించి దళితవాడలో పారిశుధ్యం మెరుగు పరచాలని స్థానికులు కోరుతున్నారు.



చేతి బోరు దగ్గర ఉన్న పేడ దిబ్బ

ముక్కంటి సేవలో చిత్తూరు కలెక్టర్

శ్రీకాళహస్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మ వార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పెద్దపాలేడు దళితవాడలో వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపాలేడు దళితవాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం 'జ్వరంతో నాలుగేళ్ల బాలిక మృతి' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. డాక్టర్లు దివాకర్, విద్యాసాగర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పా టు చేశారు. జర్వం ఉన్న వారిని గుర్తించి రక్తపూతలు సేకరించారు. ఉచితంగా మం దులు పంపిణీ చేశారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో మృదులవాణి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివకుమార్ పరిశీలించారు.

సూర్యనారాయణుడికి ప్రత్యేక పూజలు

ఏర్పేడు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణస్వామికి ఆదివారం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక అభిషేక పూ జలు నిర్వహించారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఈ పూజలు చేశారు. ఈ మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామ చంద్రారెడ్డి, వేదపండితులు పవన్, యోగేంద్ర శర్మ, వంశీకృష్ణశర్మ తదితరులున్నారు.

వివాహ వేడుకల్లో టీడీపీ పట్టణాధ్యక్షుడు

శ్రీకాళహస్తి: టీడీపీ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షఫీ కుమార్తె వివాహం ఆదివారం పట్టణంలో జరిగింది. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయ కుమార్‌నాయుడు హాజరై వధూ వరులకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, కంఠా రమేష్ పాల్గొన్నారు.